
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
బుధవారం 24 సెప్టెంబరు 2025



## క్వార్టర్స్ ముసుగులో వైసీపీ రాజకీయాలు

- మంత్రిపై నిందలు వేస్తే సహించం
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



ప్రభుత్వ క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు క్వార్టర్స్‌ను అడ్డుపెట్టుకుని కుట్ర రాజకీయాలకు పాల్పడితే తగిన బుద్ధి చెబుతామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ఏ, బీ, సీ క్వార్టర్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హామీ మేరకు కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీ మారుస్తామన్నారు. ఈ ప్రక్రియలో వంద ఎకరాల్లో ఏ, బీ, సీ క్వార్టర్స్ స్థలాన్ని ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటే మంత్రిపై ఆపాదించి.. నిందలు వేస్తారా? అంటూ మండిపడ్డారు. మంత్రిపై నిందలు వేస్తే సహించమన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు కుట్ర రాజకీయాలు మాని కర్నూలు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## హంద్రీకి జీడీపీ నీరు విడుదల

**నాలుగో గేటు ఎత్తి 500 క్యూసెక్కులు..**



జీడీపీ నాలుగో గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి మంగళవారం మధ్యాహ్నం హంద్రీ నదికి నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు నాలుగో గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టుకు వరదనీరు చేరడంతో గేటు మూసి వేశామని, అయితే సోమవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో ఓ మోస్తరు వర్షం కురియడంతో మంగళవారం మధ్యాహ్నానికి వరద నీరు వచ్చి చేరిందన్నారు. దీంతో ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం 376.88 మీటర్లు ఉందన్నారు. దీంతో జీడీపీ నిండు కుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.12 మీటర్లు మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా ఉందని, ఇకపై ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు వివరించారు. ఫలితంగా రబీ సీజన్‌లో ఆయకట్టు రైతులకు నీటి కొరత లేకుండా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బ్రహ్మచారిణిగా భ్రామరి



మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు

- మయూర వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- శ్రీశైలంలో వైభవంగా దసరా ఉత్సవాలు

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం భ్రమరాంబికా అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా సాయంత్రం మయూర వాహనంపై మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి విహరించారు. నవదుర్గా అలంకారాల్లో ఒకటైన బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలాన్ని ధరించిన అమ్మవారిని దర్శించుకోవడం వల్ల శుభఫలితాలు, విజయాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. గ్రామోత్సవంలో భాగంగా మయూరవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అశేష భక్తజనం నడుమ కోలాహలంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. గ్రామోత్సవం సాగుతుండగా కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాదస్వరం, కేరళచండీ, డమరుకం, చెక్కభజన, తప్పెడ, డోలు విన్యాసం తదితర కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:** ఆలయంలోని దక్షిణ మాడవీధిలో ఉన్న నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం నంద్యాలకు చెందిన ఎస్. నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శైవ గీతాలకు చిన్నారులు, కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

**నేడు చంద్రఘంట అలంకరణ:** దసరా మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం భ్రమరాంబికా అమ్మవారు చంద్రఘంట అలంకారణలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు రావణవాహనసేవ నిర్వహిస్తారు.



బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు

**కుమారి పూజ ప్రత్యేకం :** దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతీరోజు కుమారి పూజలు జరిపించబడుతున్నాయి. ఈ కుమారి పూజలో రెండు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం ఆనవాయితీ.



గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసం

## మాజీ ఎమ్మెల్యే..మార్క్ రాజకీయం

- కూటమిలో కలకలం
- ఎంపీపీపై అవిశ్వాసానికి సిద్ధం
- నాడు మున్సిపల్ చైర్మన్.. నేడు ఎంపీపీ



సబ్ కలెక్టర్ ఆఫీసు వద్ద మాట్లాడుతున్న ఎంపీటీసీలు

ఆదోని రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మార్క్ రాజకీయం కొనసాగుతోంది. కూటమి నేతల్లో కలకలం రేపుతోంది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి వైసీపీ సిద్ధమైంది. సాయికి అత్యంత సన్నిహితంగా ఉంటున్న నాగేంద్ర భార్య బోయ శాంతను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆమె వైసీపీలోనే ఉండగా నాగేంద్ర మాత్రం బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి పంచాన చేరారు. సాయి ప్రసాద్‌రెడ్డి తన మార్క్ రాజకీయంతో వైసీపీ తరపున గెలిచిన కౌన్సిలర్ల బలం ఉండడంతో నాలుగు నెలల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతపై అవిశ్వాసం పెట్టారు. ఆమెను దించి వైసీపీ కౌన్సిలర్ లోకేశ్వరిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు.

**సబ్ కలెక్టర్‌ను కలిసి..**

అవినీతికి పాల్పడుతుందని తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని, దానమ్మను దించడానికి అవిశ్వాస తీర్మానం పెట్టాలని వైసీపీ ఎంపీటీసీలు 19మంది మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి విన్నవించారు. ఎంపీపీ దానమ్మ 2021 సెప్టెంబరు 24న ప్రమాణస్వీకారం చేశారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కచ్చితంగా నాలుగేళ్లు పూర్తికావాలని సబ్ కలెక్టర్ సూచించారు. బుధవారంతో నాలు గేళ్లు పూర్తవుతాయని, రేపు వస్తామని వారు వెళ్లిపోయారు.

**ఓటు వేసే హక్కు ఉండదు**

పంచాయతీ చట్టం 1994 ప్రకారం ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టి నూతనంగా ఎంపీపీని ఎన్నుకునే క్రమంలో ఎంపీటీసీలకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఒకవేళ ఎమ్మెల్యే ఆ కార్యక్రమంలో పాల్గొనవచ్చుగాని, ఓటు వేసే హక్కు ఉండదు. ప్రస్తుతం ఆదోని ఎంపీటీసీల్లో మెజార్టీ శాతం వైసీపీ వారే. ఏది ఏమైనా అవిశ్వాసంలో కూడా తానే నెగ్గుతానని ఎంపీపీ దానమ్మ సవాల్ విసురుతోంది.

**మండలంలో 29 ఎంపీటీసీలు..**

ఆదోని మండలంలో 29 ఎంపీటీసీలున్నాయి. ఇందులో మండిగిరి 1, 2, గోనబావి ఎంపీటీసీలకు ఎన్నికలు జరగకపోవడంతో 26 ఎంపీటీసీలకే ఎన్నికలు జరిగాయి. ఇందులో ఇద్దరు మాత్రమే టీడీపీ తరపున గెలిచారు. మిగిలిన 24మంది వైసీపీ నుంచి విజయం సాధించారు. వీరిలో ఇస్వీ ఎంపీటీసీ కొమ్మ సరస్వతీ, బసరకొడు ఎంపీటీసీ పెద్దపెద్దయ్య మృతిచెందారు. ఆరేకల్లు ఎంపీటీసీ శ్యామలమ్మ రాజీనామా చేసింది. ప్రస్తుతం 23మంది ఎంపీటీసీలు కొనసాగుతున్నారు. వీరిలో 21మంది వైసీపీ, ఇద్దరు టీడీపీ. మాజీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉంటూ వైసీపీకి చెందిన బడాయి పొంపాపతి భార్య దానమ్మను ఆదోని ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఈమె సైతం ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో కండువా మార్చింది. నమ్మిన వ్యక్తికి పదవి అంటగడితే నన్నే మోసం చేస్తాడా అని మాజీ ఎమ్మెల్యే సాయి, వైసీపీ శ్రేణులు గుర్రుమంటున్నాయి. ఎలాగైనా ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని తీర్మానించారు. ప్రతిపక్ష హోదాలో కూడా లేని వైసీపీ ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్‌పై, ప్రస్తుతం ఎంపీపీపై అవిశ్వాసం పెట్టి తమ పంతం నెగ్గించుకుంటుంటే అటు ఎమ్మెల్యే గాని, ఇటు కూటమి నాయకులు మౌనంగా ఉండడం తగదని పలువురు చర్చించుకుంటున్నారు.

## 5 లోపు రేషన్ సరుకులు అందజేయాలి



కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాప్ డీలర్లు ప్రతినెలా 5వ తేదీ లోపు అంగన్‌వాడీలకు సరుకులు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఐసీడీఎస్, డీఎస్‌డీవో, డీఎం సివిల్ సప్లై, సీఎస్‌డీటీ, సీడీపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఇచ్చే అన్ని రకాల సరుకులు నాణ్యత కలిగి ఉండాలన్నారు. ఈ పాస్ మిషన్‌లో వేలిముద్ర వేసి మొత్తం సరుకులను ఒకేసారి తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయ, డీఎం సివిల్ సప్లై వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి
- గ్రీన్‌కో ప్రాజెక్టు పనుల పరిశీలన

ఓర్వకల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎనర్జీ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సిరి గ్రీన్ కో అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుమ్మితంతండా వద్ద నిర్మిస్తున్న గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ను కలెక్టర్ సందర్శించారు. ప్రాజెక్ట్ సైట్‌లోని అప్పర్ రిజర్వాయర్, అప్పర్ ఇన్ టేక్ పాయింట్, ప్రాజెక్ట్ సైట్, పవర్ హౌస్ ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పనితీరు, రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి పంపింగ్ ప్రక్రియల గురించి కలెక్టర్ గ్రీన్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. 1,680 మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే మొట్టమొదటి, అతిపెద్ద పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్ అని, 4000 మెగావాట్ల సౌర, 1000 మెగావాట్ల పవన సామర్థ్యంతో కలిపి మొత్తం 6,680 మెగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని కలిగి ఉందని గ్రీన్ కో అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సందర్శన సమయంలో ఎగువ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నప్పుడు టర్బైన్ పనిచేయడాన్ని కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలకు కట్టుబడి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమర్థవంతమైన భూ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక సమస్యలను ముందుగానే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పీడీ శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాస్ నాయుడు, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్, సర్వేయర్ శంకర్ మాణిక్యం, ఎస్ఐ సునీల్‌కుమార్, విద్యుత్ ఏఈ సునీల్‌బాబు, గ్రీన్‌కో అధికారులు పాల్గొన్నారు.



గ్రీన్ కో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి



కర్నూలు గీతామందిర్‌లో శ్రీ కాల స్వరూపి అలంకరణలో అమ్మవారు

6

## శ్రీశైలంలో 10గేట్లతో నీటి విడుదల

- నీటి నిల్వ సామర్థ్యం 203 టీఎంసీలు



10 గేట్లతో కొన సాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ జూరాల స్పిల్‌వే, సుంకేసుల, హంద్రీ నుంచి డ్యాంకు 3.58లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం పది గేట్ల ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. వరద వేగం పుంజుకోవడంతో గేట్ల ఎత్తును 14 అడుగులకు ఇంజనీర్లు పెంచారు. రెండు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం 65,482 క్యూసెక్కులు విడుదల చేశారు. గడిచిన ఇరవై నాలుగు గంటల్లో 31.869 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు జెన్‌కో అధికారులు అనుసంధానం చేశారు. మంగళవారం సాయంత్రం నీటినిల్వ సామర్థ్యం 203 టీఎంసీలుగా ఉంది.

## సూపర్ జీఎస్టీ





ప్రజలపై పన్నుల భారం తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన సమూల మార్పులు అమల్లోకి వచ్చాయి. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి, ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ తదితర వాటిపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. రైతుల కోసం ఎరువులు, పురుగుల మందులు, ట్రాక్టర్లపై 12 శాతం నుంచి 5 శాతానికి కుదించింది. ఈ క్రమంలో జీఎస్టీ తగ్గింపుతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వస్తువుల కొనుగోళ్ల శాతం గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా నిర్మాణ రంగం సైతం ఊపందుకుంటోంది. వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు సైతం అమాంతంగా పెరిగాయి. జీఎస్టీ తగ్గింపునకు తోడు దసరా ఆఫర్లు రావడంతో మధ్యతరగతి ప్రజలు కావాల్సిన వస్తువులను తమకు వచ్చిన బడ్జెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెద్ద షోరూంల నుంచి చిన్న పాటి దుకాణం వరకు వినియోగదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి.



- జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన విక్రయాలు
- పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట
- ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి కార్ల వరకు
- నిత్యావసర సరుకుల్లోనూ భారీగా తగ్గింపు
- జీఎస్టీకి తోడు దసరా ఆఫర్లు

నంద్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును అమలు చేయడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలు షోరూంలు, రిలయన్స్, సత్యా మోర్ తదితర బడా మాల్స్‌లో సైతం జీఎస్టీ తగ్గించి వ్యాపారా లావాదేవీలు చేశారు. దీంతో వినియోగదారులు సైతం పెద్దఎత్తున తరలి వచ్చి తమకు అవసరమైన వస్తువులు, వాహనాలను సైతం కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా కార్లు, ఏసీలు, వాషింగ్ మిషన్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు సైతం అధికంగానే కొనుగోలు చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి కార్లు, ట్రాక్టర్లు.. ద్విచక్ర వాహనాల వరకు సుమారు 375 వస్తువుల వరకు జీఎస్టీ తగ్గింపు వర్తించింది. ఇదే క్రమంలో ఇంటి నిర్మాణ రంగాని వినియోగించే సిమెంట్‌పై జీఎస్టీ 28శాతం నుంచి 18శాతం తగ్గించారు. జీఎస్టీ తగ్గుదల ఉంటుందని నెల రోజుల ముందుగానే కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటన చేయడంతో వినియోగదారులు తమకు కావాల్సిన వస్తువుల కోసం వేచి చూశారు. జీఎస్టీ తగ్గుదలతో పాటు దసరా పండుగ ఆఫర్లు రావడంతో వినియోగదారులు తమకు నచ్చిన వస్తువులను బడ్జెట్‌లో కొనుగోలు చేస్తున్నారు.



షోరూంలో కొనుగోలుదారులు

మిగతా 7వ పేజీలో

## రేపు నియామక పత్రాల పంపిణీ

- విజయవాడలో మెగా డీఎస్సీ విజయోత్సవ సభ
- నేడు కర్నూలు నుంచి విజయవాడకు బయలుదేరనున్న 124 ఆర్టీసీ బస్సులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి నిరుద్యోగుల కలలను సాకారం చేశారు. ఏడాది కాలంలోనే మెగా డీఎస్సీకి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి అతి తక్కువ కాలంలోనే ఫలితాలు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని కేటగిరీల్లో కలుపుకుని 2805 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. మరో 88 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 88 ఉపాధ్యాయ పోస్టులు మిగిలిపోయాయి. వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో మిగిలిపోయిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 19వ తేదీనే ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను పంపిణీ చేయాల్సి ఉంది. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమం రద్దయింది. మళ్లీ ఈనెల 25వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కర్నూలు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ధ్రువపత్రాలను పరిశీలన చేసుకున్న రాయలసీమ విశ్వ విద్యాలయంలో బుధవారం ఉదయం 6 గంటల్లోపు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 124 ఆర్టీసీ బస్సులను ఉమ్మడి జిల్లాలకు కేటాయించారు. కర్నూలు నుంచి 8.30 గంటలకు విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులను కలెక్టర్ డాక్టర్ సిరి జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ బస్సులు విజయవాడకు బయలుదేరి వెళ్తాయని డీఈవో తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ పేర్కొన్నారు.

# కన్నీటి ఉల్లి

ఉల్లి పంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. మూడు నెలల పాటు ఉల్లి పంటను పండిస్తే ధరలేక రైతన్నలు కుప్పకూలిపోయే పరిస్థితి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలిలో రామసుబ్బారెడ్డి అనే రైతు రెండెకరాల్లో ఉల్లిని సాగు చేశాడు. ధర లేకపోవడంతో మంగళవారం పొలంలోనే కుప్పలుగా పోసిన ఉల్లి గడ్డలను వదిలేశాడు. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని వారి వారి గృహాలకు తీసుకెళ్లారు. కేజీ ధర రూ.2 పలకడంతో ఉల్లిగడ్డలు కోసిన కూలీలు రూ.15వేలు అవుతుండటంతో పంటను వదిలేశానని రైతు ఆవేదన వెలిబుచ్చాడు. రెండెకరాల్లో పెట్టుబడి రూ.లక్ష దాక ఖర్చు చేశానని, తీరా పంట చేతికొచ్చాక ధర లేక నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి





చిన్నవంగలిలో ఉల్లిగడ్డలను సంచులకు వేసుకుంటున్న మహిళలు

# కోనసీమ అందాలు

- కనువిందు చేస్తున్న పచ్చటి పొలాలు
- కొండను కప్పేసిన మంచు తెరలు

చాగలమర్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, చింతలచెరువు భైరవగుండాల సమీపంలో కురిసిన వర్షాలతో కమ్ముకున్న మబ్బులు, మంచు తెరలను చూపరులను కనువిందు చేశాయి. శెట్టివీడు గ్రామ సమీపంలో కోనసీమను తలపించేలా పచ్చని పంట పొలాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి.



శెట్టివీడు గ్రామ సమీపంలో కనువిందు చేస్తున్న పచ్చని పొలాలు



భైరవగుండాల సమీపంలో కొండలపై మంచు తెరల్లా మేఘాలు



## సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు

● తెలుగుగంగ ఈఈ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ లో తెలుగుగంగ ప్రధాన కాలువ సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం ఆదేశించిందని ఇందుకు సబంధించి ప్రతిపాదనలు పంపినట్లు తెలుగు గంగ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో తెలుగుగంగ ప్రధాన కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.204 కోట్లతో తెలుగుగంగ ప్రధాన కాలువ మరమ్మతులకు నివేదికలు పంపినట్లు చెప్పారు. 10కిలో మీటర్ నుండి 96.13 కిలోమీటర్ వరకు పెండింగ్ ఉన్న పనులు పూర్తి చేసి కాలువలో నీటి సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగు గంగ ప్రాధన కాలువ వెంట తిరిగి చేశామని అక్కడక్కడ గేట్లు, బండ్ల వెడల్పు లైనింగ్ రివిట్‌మెంట్ పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే పనులు పూర్తి చేసి రైతులకు నీటి కొరత లేకుండా చూస్తామని ఆయన వివరించారు.



తెలుగుగంగ కాలువను పరిశీలిస్తున్న ఈఈ మురళీకృష్ణ

## విద్యార్థులు పథకాలను తెలుసుకోవాలి

● క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వ పథకాలను తెలుసుకొని, కుటుంబసభ్యులకు వివరించాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం క్లస్టర్ యూనివర్సిటీలో వికసిత్ భారత్ సేవా సర్వ్ 2025 వర్క్‌షాపును తెలుగు శాఖ అధ్యాపకురాలు ఫమీదాబేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం ప్రతిష్టాత్మకమైన మంచి పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. వీటి గురించి చాలామంది గ్రామీణ ప్రాంత ప్రజలకు, చదువు రానివారికి విద్యార్థులు తెలియజేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, డీన్ నాగరాజశెట్టి, వాహిజ్, అధ్యాపకులు ఎల్లాకృష్ణ, నాగ్ అరుణ్, డి.మల్లయ్య పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ప్రిన్సిపాల్

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో మాద్రక ద్రవ్యాల సంబంధిత నేరాలపై అవగాహన సదస్సు జరిగింది. ఎస్ఐ సృజనకుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఫకృన్నీసా, అధ్యాపకులు వింధ్యావాసిని దేవి, మాదన్న, సుజాతా, షాజీదా పాల్గొన్నారు.

# అరటి ధర పతనం

- టన్ను రూ.4 వేలకు పడిపోయిన రేటు
- ఆందోళనలో అన్నదాతలు



అరటిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. ఎన్నో కష్టానష్టాలకు ఎదురొడ్డి పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లి, టమోటా, చీనీ ధరలు పతనమై తీవ్ర నష్టాలతో కుదేలవుతున్న అన్నదాతలకు తాజాగా అరటి ధరలు కూడా ఆకోవలోకే చేరుకోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. గత నెల, రెండు నెలల క్రితం ఆశాజనకంగానే ఉన్న అరటి ధరలు ప్రస్తుతం రోజురోజుకూ పతనం అవుతుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అరటి టన్ను రూ.22 వేల నుంచి రూ.24వేల వరకు పలికింది. దీంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. గత నెలన్నర క్రితం శ్రావణ మాసంలో కూడా అరటి ధరలు అదరహో.. అనిపించాయి. టన్ను రూ.18 వేల నుంచి రూ.20వేల వరకూ పలికాయి. అయితే కొన్నిరోజులుగా మార్కెట్లో అరటి ధరలు అధఃపాతాళానికి పడిపోయాయి. ప్రస్తుతం అరటి ధర రూ.4వేలు, రూ.5వేలు మించి పలకకపోవడంతో అన్నదాతలు కుదేలవుతున్నారు. సిరులు కురిపిస్తుందనుకున్న అరటి నష్టాలను మిగులుస్తోందని రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల ఎకరాలకు పైగా రైతులు అరటి సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. ఒక్కసారిగా అరటి ధరలు పడిపోవడంతో అన్నదాతలు దుక్కుతోచని స్థితిలో పడిపోయారు. అరటి సాగు కోసం ఎకరాకు రూ.1లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెడితే, 10, 12 టన్నుల లోపే దిగుబడి వచ్చిందని, ప్రస్తుత ధరలతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని అరటి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అరటి రైతులకు చేయూతనందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఇతర రాష్ట్రాల్లో అధిక దిగుబడే ధరల పతనానికి కారణమా?

ప్రస్తుత సమయంలో మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున అరటి దిగుబడి పెరగడమే అరటి ధరల పతనానికి ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పండే అరటి అత్యధికంగా ఢిల్లీ, ఇరాన్, ఇరాక్ దేశాలకు సైతం ఎగుమతి అవుతోంది. అయితే ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున అరటి దిగుబడి మార్కెట్లోకి రావడంతో, మన ఎగుమతులు తగ్గి, రోజు రోజుకూ ధర క్షీణిస్తోందన్న చర్చ సాగుతోంది.





గ్రేడింగ్ అనంతరం లోడింగ్ చేస్తున్న వ్యాపారులు

## సీఎంను కలిసిన రమేష్‌నాయుడు



ముఖ్యమంత్రిని కలిసిన చైర్మన్ రమేష్‌నాయుడు

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శ్రీశైలం దేవస్థాన బోర్డు చైర్మన్ పోతుగంట రమేష్‌నాయుడు కలిశారు. మంగళవారం అమరావతి లోని సీఎం కార్యాలయంలో ఆయన సీఎంను కలిసి శ్రీశైలం దేవస్థాన బోర్డు చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వామివారి శేష వస్త్రమును, లడ్డూ ప్రసాదాన్ని రమేష్‌నాయుడు సీఎంకు అందజేశారు.

## పైప్ లైన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

● ఉక్కు పరిశ్రమను పరిశీలించిన కలెక్టర్ సిరి



గుట్టపాడు వద్ద జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

ఓర్వకల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. గుట్టపాడు సమీపంలో ఏర్పాటు చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఉక్కు పరిశ్రమలో కలియ తిరిగి స్టీల్ ప్లాంట్ వివరాలను యాజమాన్యం, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ వద్ద నిర్మిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ఉద్యానవనం పార్కును అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అనంతరం జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్‌ను పరిశీలించారు. అంతకు ముందు డ్రోన్ హబ్‌కు కేటాయించిన 300 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాసన మండలిలో ప్యానల్ స్పీకర్‌గా బీటీ నాయుడు



కోసిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో కోసిగి మండలం జుమ్మాలదిన్నె గ్రామానికి చెందిన సాధారణ రైతు కుటుంబానికి చెందిన బీటీ నాయుడిని ఏపీ శాసన మండలిలో ప్యానల్ స్పీకర్‌గా ఎంపిక చేశారు. దీంతో జుమ్మాలదిన్నె గ్రామస్థులు, కోసిగి మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రీవిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు మంగళవారం శాసన మండలిలో ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించి స్పీకర్ కుర్చీ నుంచి సభ కార్యక్రమాలను నడిపించారు. సభలో జరిగే చర్చలను శాంతంగా వినిపిస్తూ సభ్యుల అభిప్రాయాలకు సమాన అవకాశాలు ఇస్తూ అధికార, ప్రతిపక్ష సభ్యుల చర్చలు సజావుగా కొనసాగేలా చూశారు.

## ప్రహ్లాద వరద స్వామికి తిరుమంజనం



తిరుమంజనం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ స్వామి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం దసరా ఉత్సవాల అంకురార్పణను వైభవంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులు ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు వేదపండితులు నవకలశాలను ప్రతిష్ఠించి తిరుమంజనం నిర్వహించారు. ఆలయ కోనేరులోని పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాతో అభిషేకం చేశారు.

## నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరు 29వ తేదీ నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు పొడిగించారన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. మరిన్ని వివరాలకు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# వివిధ రూపాల్లో అమ్మవారు



మహానందిలో బ్రహ్మచారిణి దుర్గ అలంకారంలో అమ్మవారు

### బ్రహ్మచారిణిగా కామేశ్వరీమాత

మహానంది: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహానంది క్షేత్రంలో కామేశ్వరీదేవి అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాల మండపంలో ఉభయ దాతల చేత చండీహోమంతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. ఇదిలా ఉండగా భారీ వర్షం నేపథ్యంలో దుర్గామాత అలంకరణలో జరగాల్సిన అమ్మవారి గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. మూడోరోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తారు.

కర్నూలు కల్చరల్/ మంత్రాలయం/ గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం వివిధ ఆలయాలతో పాటు మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు బ్రహ్మణచారిణి (గాయత్రి మాత) రూపంలో భక్తులు పూజించారు. కర్నూలు నగరంలోని పూలబజార్‌లో చిన్న అమ్మవారిశాలలో అమ్మవారికి పరాశక్తి అలంకరణ, వన్‌టౌన్‌లోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రీకాల స్వరూపిణిగా, కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి మాత గౌరీదేవిగా దర్శనమిచ్చారు. కర్నూలు శివారు మామిదాలపాడులోని గోదా గోకుల క్షేత్రంలో అమ్మవారికి ధాన్యలక్ష్మి అలంకరణ చేశారు. మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. మంత్రాలయంలోని శ్రీమఠంలో కొలువైన మంచాలమ్మ దేవికి గాజులతో అలంకరించారు. గూడూరు మండల కేంద్రంలో వెలసిన సుంకులాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కర్నూలు నిమిషాంబా దేవాలయంలో



కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్న దృశ్యం



మంత్రాలయం: విశేషంగా గాజులు, పుష్పాలతో మంచాలమ్మ దేవతను అలంకరించిన దృశ్యం



### బ్రహ్మచారిణి అలంకరణలో చౌడేశ్వరీ మాత

బనగానపల్లె: నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీమాత బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీవీ కుమార్ రెడ్డి, వీవీ నాగార్జునరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# బోగస్ ఉత్తర్వులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం..!



ఉత్తర్వులు అందజేస్తున్న కృష్ణమూర్తి అలియాస్ త్రిమూర్తిరావు

- ప్రభుత్వ పాఠశాలలో నెల రోజులు విధులు
- జీతం అడగడంతో వెలుగులోకి వచ్చిన బాగోతం
- జిల్లాలో 30 మందికి ఉద్యోగాల పేరిట మోసం
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీఈవో శామ్యూల్ పాల్

**కర్నూలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** నిరుద్యోగ యువతకు ఉద్యోగాల పేరిట వల వేశారు. నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఉత్తర్వులు సృష్టించారు. దర్జాగా ప్రభుత్వ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని సైతం నమ్మించారు. అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్‌గా విధుల్లో చేర్పించారు. ఆ పాఠశాలలో నెల రోజులు విధులు నిర్వర్తించిన ఆమె జీతం కోసం సీఎఫ్ఎంఎస్ ఖాతా నంబరు చెప్పాలని ప్రధానోపాధ్యాయుడిని అగడంతో ఈ భాగోతం వెలుగులోకి వచ్చింది. బోగస్ ఉత్తర్వులు సృష్టించి మోసాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై మంగళవారం కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు.

కర్నూలు నగరానికి చెందిన కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు అనే వ్యక్తి రాష్ట్ర సచివాలయంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నట్లు నిరుద్యోగులను నమ్మించాడు. అంతేకాదు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో), పాఠశాల ప్రధానోపాధ్యాయులను సైతం బోల్తా కొట్టించాడు. కర్నూలు నగరం నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన పీఆర్ పింకి అనే మహిళ గుంటూరులో స్థిరపడ్డారు. ఆమెకు జోహరాపురం ఇందిరమ్మ కాలనీలో నగరపాలక ప్రాథమిక పాఠశాలలో (కల్లూరు దర్వాజ) అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్ ఉద్యోగం ఇస్తున్నట్లుగా, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), సమగ్ర శిక్ష ఎక్స్-అఫిషియో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఉత్తర్వులు సృష్టించారు. ఆ ఉత్తర్వులపై అర్బన్ ఎంఈఓ సంతకాలు ఉన్నాయి. సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టరు (ఏడీ)గా చెప్పుకుంటున్న కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు, మరో ఇద్దరు వ్యక్తులు ఓ కారులో పీఆర్ పింకితో కలసి జోహరాపురంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్‌తో కృష్ణమూర్తి ఎస్ఎస్ఏ ఏడీగా పరిచయం చేసుకుని అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్‌గా పీఆర్ పింకిని విధుల్లో చేర్పించారు. ఇంతదాక సవ్యంగా సాగిపోయింది. విధుల్లో చేరిన బోగస్ టీచర్ పింకి నెల రోజుల పాఠశాలలో విధులు నిర్వర్తించింది. ఆ తరువాత జీతం కోసం సీఎఫ్ఎంఎస్ ఖాతా ఐడీ నంబరు కావాలని హెచ్ఎం మల్లేశ్‌ను అగడడంతో అనుమానం వచ్చి డీఈవో శామ్యూల్ పాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఉత్తర్వులు పరిశీలించిన ఆయన అది బోగస్ ఉత్తర్వు అని తేలిపోయింది. తక్షణమే నకిలీ ఉపాధ్యాయురాలు పీఆర్ పింకిని పాఠశాల నుంచి బయటకు పంపించారు. ఈ భాగోతంలో రూ.లక్షలు చేతులు మారినట్లు సమాచారం. ఆ బోగస్ ఉత్తర్వులపై కర్నూలు అర్బన్ ఎంఈఓ సంతకం కూడా ఫోర్జరీ చేశారు. కారులో ఉన్నతాధికారుల పేరుతో దర్జాగా రావడం, ఉత్తర్వులు ఉన్నట్లు పేపర్లు ఉండటంతో బోగస్ టీచర్ పీఆర్ పింకీ జాయినింగ్ ఆర్డర్‌పై సంతకం చేశారని ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్ రాతపూర్వకంగా రాసిచ్చినట్లు డీఈఓ తెలిపారు. ఇలా పింకీ ఒక్కటే కాదు.. ఈ ముఠా దాదాపు 30 మందికిపైగా నిరుద్యోగులను ఉద్యోగాల పేరిట మోసం చేసి రూ.లక్షలు వసులు చేసినట్లు తెలుస్తోంది. సమగ్ర విచారణ చేస్తే ఉద్యోగాల పేరిట సాగించిన మోసాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



బోగస్ ఉత్తర్వులు ఇవే

### ఎస్పీకి ఫిర్యాదు చేశాం



నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్‌గా పీఆర్ పింకీ అనే మహిళలకు బోగస్ ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు అనే వ్యక్తి ఎస్ఎస్ఏ ఏడీగా పరిచయం చేసుకొని జోహరాపురం ఇందిరమ్మ కాలనీ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పీఆర్ పింకీ అనే మహిళను టీచరుగా విధుల్లో చేర్పించాడు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్ నా దృష్టికి తీసుకువచ్చారు. అది బోగస్ ఉత్తర్వు అని తేలడంతో పీఆర్ పింకీని పాఠశాల నుంచి బయటకు పంపిచాం. ఎంఈఓ ప్రభావతమ్మ తన సంతకం ఫోర్జరీ చేశారని లిఖితపూర్వకంగా తెలిపారు. నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఉత్తర్వులు తయారు చేసి మోసానికి పాల్పడడమే కాకుండా సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టరు (ఏడీ)గా చెప్పుకుంటున్న కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు, కర్నూలు రెడ్‌క్రాస్‌లో పని చేస్తున్న సుభాష్, నాయుడుపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశాను. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంఈఓ ప్రభావతమ్మ, పాఠశాల హెచ్ఎం మల్లేశ్‌పై శాఖపరమైన చర్యల కోసం ఆర్జేడీకి సిఫార్సు చేశాం. **- శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు**

# సూపర్ జీఎస్టీ

(5వ పేజీ తరువాయి)

రోజూ వారీ వినియోగంలో ఉండే సబ్బులు, ఫేస్ పౌడర్లు, చర్మసౌందర్య వస్తువులు, షాంపూలు, టూత్ పేస్టులు, బ్రష్‌లపై కూడా జీఎస్టీ తగ్గింపు లభించింది. ఈ లెక్కన ప్రతి నెల పేద, మధ్య తరగతి ప్రజలకు నెలకు సుమారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఆదా అయినట్టే.



### జీఎస్టీ తగ్గించడంతో కొనుగోలు చేశా

కేంద్ర ప్రభుత్వం టీవీలపై జీఎస్టీ తగ్గించడంతోనే 55 ఇంచెస్ ఎల్ఈడీ టీవీని కొనుగోలు చేశాను. ప్రస్తుతం రూ.58 వేలు పెట్టి కొన్నాను. గతంలో ఇదే టీవీ రూ.66 వేలు ఉంది. ఎప్పటి నుంచో ఇలాంటి టీవీ కొనాలని అనుకున్నాను. కేంద్రం జీఎస్టీ తగ్గించడంతో పేద వర్గాలకు ఎంతో ఉపయోగకరం. **- సత్య, నంద్యాల**

### బొలెరో వాహనంపై రూ.95 వేలు తగ్గింది



వ్యక్తిగత పనుల నిమిత్తం ఓ బొలెరో వాహనం కొనాలని కొన్ని రోజుల కిందట నంద్యాల పట్టణంలోని ఓ షోరూం వద్దకు వెళ్లాను. ఆసమయంలోనే కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై ప్రకటన చేసింది. 22వ తేదీ అమలు చేస్తారని ప్రకటించడంతో అప్పటి నుంచి ఎదురుచూశా. అప్పుడు బొలెరో మ్యాక్స్ హెచ్‌డీ రూ.11.45 లక్షలు ఉండగా.. జీఎస్టీ తగ్గింపుతో రూ.10.50 లక్షలకు వచ్చింది. రూ.95 వేలు తగ్గడం ఎంతో సంతోషంగా ఉంది. **- కరుణాకర్‌గౌడ్, నంద్యాల**



### నిత్యావసర సరుకులపై తగ్గింపు పేదలకు ఊరట

కొన్నింటిపై 12 నుంచి 5శాతం జీఎస్టీ తగ్గించడంతో పేదలకు వరం లాంటిది. ప్రధానంగా నిత్యావసర సరకులపై కూడా తగ్గించడంతో ఎంతో పేద ప్రజలకు ఉపయోగపడుతుంది. సోప్స్ టూత్‌పేస్టులు, బ్రష్‌లు, స్నాక్స్, పౌడర్స్, నెయ్యి, డ్రైఫ్రూట్స్ గ్రాసరీ తదితర వస్తువులపై గతంలో 12శాతం ఉండేది. విద్యార్థుల వస్తువులపై తగ్గించడంతో మంచిది. నా కుటుంబానికి నెలకు అయ్యే ఖర్చులో.. సుమారు రూ.1,500 తగ్గుతుంది. **- సుబ్బరాయుడు, నంద్యాల**

### ఏసీపై రూ.4వేలు తగ్గింది



జీఎస్టీ తగ్గింపుతో రూ.45,990 పెట్టి రిలయన్స్‌లో కొనుగోలు చేశాను. గతంలో రూ.49,990 ఉండగా.. జీఎస్టీ తగ్గింపుతో రూ.4వేలు తగ్గింది. గతంలో వెనక్కి వెళ్లాను. మధతరగతి వాళ్ల కూడా ఏసీలు కొనుగోలు చేయొచ్చు. **- ఫరూక్, వెంకటేశ్వరపురం**



### బైకుపై రూ.8వేలు తగ్గింది

రెండు నెలల క్రితం 120 సీసీ హోండా షైన్ వాహనం కొనుగోలు చేద్దామని షోరూమ్‌కు వచ్చా. రూ.1,12,000 ఉండటంతో కొనలేదు. జీఎస్టీ తగ్గింపుతో రూ.1,04,000 పెట్టి కొనుగోలు చేశా. రూ.8వేలు తగ్గింది. నాతో పాటు చాలామంది వాహనాలను కొనుగోలు చేశారు. **-షేక్ జాఫర్, సాయిబాబానగర్, నంద్యాల**

### ట్రాక్టర్‌పై రూ.35 వేలు తగ్గింది



జీఎస్టీ తగ్గింపుతో 480 మోడల్ ట్రాక్టర్ రూ.28 లక్షలు ఉండగా.. రూ.35 వేలు తగ్గించారు. కేంద్రం జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఉపయోగం. ఒక్క సారిగా రూ.35 వేలు తగ్గడం సంతోషంగా ఉంది.
**- జల్లి నరసింహులు, శ్రీ రంగాపురం**

# గోపవరంలో బంగారం చోరీ

- పరిశీలించిన ఏఎస్పీ మందా జావళి

**మహానంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని గోపవరంలో మంగళవారం చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన కాకుల లక్ష్మీదేవి శనివారం డోన్‌లో నివాసం ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి చేరుకుని పరిశీలించగా ఆమె ఇంట్లోని బీరువాను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి ఉండటం గమనించింది. దొంగలు బీరువాలోని రెండు తులాల బంగారు నగలతో పాటు జత కమ్మలను దోచుకున్నట్లు గుర్తించింది. ఈ విషయాన్ని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డికి తెలిపారు. సంఘటన స్థలాన్ని నంద్యాల ఏఎస్పీ మందా జావళి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహానంది పోలీసులు వివరించారు.

### బస్టాండులో చోరీ

**నంద్యాల టౌన్:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో మంగళవారం చోరీ జరిగింది. వన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల బస్టాండు నుంచి వెలుగోడుకు నాగమణి కూతురుతో వెళ్తుండగా బస్సు ఎక్కే సమయంలో 10 తులాల బంగారు చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

# చికిత్స పొందుతూ రైతు మృతి


బోయ రంగడు(ఫైల్)

**డోన్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రైతు బోయ రంగడు(60) చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బోయ రంగడు గత ఆదివారం అప్పుల బాధ తాళలేక తన పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బంధువులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మూడు సంవత్సరాల నుంచి తనకున్న నాలుగెకరాల పొలంలో సాగు చేసిన పంటలు చేతికిరాక అప్పులు అధికమయ్యాయి. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయ త్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది రెండోకరాల్లో వేసిన ఉల్లిగడ్డలు తీవ్ర నష్టాలు మిగిల్చాయి. భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

# కుక్కల దాడిలో జింక మృతి

**ఉయ్యాలవాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):** మండలంలోని హరివరం గ్రామంలో కుక్కల దాడికి మంగళవారం ఉదయం ఓ జింక మృతి చెందింది. స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో గోపాల్ నాయుడు వెంటనే స్పందించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. బనగానపల్లె ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జయమ్మ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతి చెందిన జింకకు పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వేలు తదితరులు పాల్గొన్నారు.

# పొలం అమ్ముతామని చెప్పి మోసం

- ముగ్గురిపై కేసు నమోదు

**మంత్రాలయం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కల్లుదేవ కుంటకి చెందిన కొందరు వ్యక్తులు పొలం అమ్ముతామని మోసం చేశారని రచ్చుమర్రికి చెందిన లీలావతి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు. వివరాలు.. కల్లుదేవకుంట గ్రామంలోని సర్వేనెం. 321లోని 1.40ఎకరాల భూమిని అమ్ముతామని 2023 ఆగస్టు 4న రూ.1.26కోట్లకు కురువ సోమశేఖర్, ధర్మతేజ, శాంతమ్మ అనే వ్యక్తులు ఒప్పందం కుదర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.10లక్షలు, మరోసారి రూ.51.27 లక్షలు చెల్లించామని బాధితురాలు లీలావతి చెల్లించారు. ఆమె భర్త చిన్నారెడ్డి ఏప్రిల్ 3న అనారోగ్యంతో మృతిచెందాడు. మిగతా డబ్బులు చెల్లించి పొలం రిజిస్ట్రేషన్ చేయించుకుంటానని ఆమె వారిని అడిగింది. దీనికి వారు నిరాకరించడంతో పెద్దల పంచాయితీతో రూ.1,49,50,000కు పరిష్కారంచేసి మిగిలిన నగదు 2025 ఏప్రిల్ 20న రూ.68లక్షలు చెలించాలని తీర్మానించారు. మిగతా నగదు ఇచ్చి రిజిస్ట్రేషన్‌కు రమ్మని కోరగా వారు రాకుండా ఉన్నారని ఆరోపించారు. ఈ భూమిని కల్లుదేవకుంట సొసైటీలో మార్ట్‌గేజి చేసిన విషయం చెప్పకుండా పొలం అమ్ముతామని తమ దగ్గర రూ. 81.50లక్షలు తీసుకొని మోసం చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

# జిల్లాలో ప్రకృతి వ్యవసాయ బృందం పర్యటన


పంటలను పరిశీలిస్తున్న వీఆర్ఐటీటీఐ బృందం

**నంద్యాల హాస్పిటల్/ప్యాపిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కోసం కర్నాటక రాష్ట్రానికి చెందిన వీఆర్‌టీటీఐ సంస్థ నుంచి నలుగురు సభ్యులు మంగళవారం నంద్యాల జిల్లాలో పర్యటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్థిరత్వం, స్వయం సమృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ఈ సంస్థ పనిచేస్తుంది. ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, వ్యవసాయ ఆధారిత ప్రోత్సాహక చర్యలు, మార్కెట్ లింకేజీ అందిస్తూ యువత, మహిళలను బలోపేతం చేసి స్థిరమైన ఆదాయంతో జీవనవిధానం సాధించడానికి దోహదపడుతుందని ఏడీపీఎం అబ్దుల్‌సలాం అన్నారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులు అనుసరిస్తున్న పద్ధతులను తెలుసుకున్నారు. ప్యాపిలి మండలం బావిపల్లి, నేరేడుచర్ల యూనిట్లకు చెందిన ఐసీఆర్పీలు సాగు చేస్తున్న ఏటీఎం మోడళ్లను పరిశీలించారు. 1.20 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తున్న 18రకాల వైవిధ్య పంటల విధానాలను అధ్యయం చేశారు. జలదుర్గం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి వెంకటప్ప అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. సభ్యులు రాగిణి, రఘు, సందీప్, శరత్‌తోపాటు రైతుసాధికార సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ జలాలుద్దీన్, ప్రకృతి వ్యవసాయ అదనపు ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## వాయిద్య కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** కలెక్టర్ అధ్యతన జరిగే తెలుగు కళా సమితి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన సంగీత వాయిద్యకారులను గుర్తించి సత్కరించనున్నట్లు తెలుగు కళా సమితి కార్యదర్శి ఎలమర్తి రమణయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాకారుల సేవలు, ప్రతిభ, గుర్తించి గౌరవించడం ద్వారా మన సంగీత సంప్రదాయాన్ని పెంపొందించుకోవడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. వాయిద్య సంగీతంలో 5 లేదా అంతకంటే ఎక్కువ అనుభవం ఉండాలని సూచించారు. సంగీత రంగంలో కళాకారులు చేసిన ప్రత్యేక కృషిని తెలియజేసే ప్రెస్ క్లిప్పింగులు, ఫొటోలతో తమ వివరాలు తెలియజేస్తూ దరఖాస్తులను అక్టోబరు 10లోగా ఎలమర్తి రమణయ్య, కార్యదర్శి, తెలుగు కళా సమితి 4-23-5, బాలాజీ నగర్, కర్నూలు-6 అనే చిరునామాకు పంపించాలని సూచించారు. తపాలా/పోస్టు ద్వారా పంపించిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామని వివరాలకు ఎలమర్తి రమణయ్య, సెల్ నెం.9490131005కు సంప్రదించాలని సూచించారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో, ఈవో

# మద్దిలేటి నరసింహ స్వామి సేవలో కలెక్టర్

**బేతంచెర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహ స్వామి, మహలక్ష్మీ అమ్మవారి దేవస్థానాన్ని కలెక్టర్ రాజకుమారి గణియ మంగళవారం దర్శించుకు న్నారు. ఉప కమిషనర్, ఈవో రామాంజనేయులు కలెక్టర్‌కు పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోన్ ఆర్డీవో నరసింహులు, ఈవో రామాంజనేయులు శాలువా కప్పి సత్కరించారు.

# జీవితాలతో ఆటోలాడుకుంటున్నారు


ఆటోలో కిక్కిరిసి ప్రయాణిస్తున్న కూలీలు

ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. ఆటో సామర్థ్యం డ్రైవర్‌తో కలిసి ఐదుగురు మాత్రమే. అయితే కొందరు డ్రైవర్లు కెపాసిటీకి ఐదారింతలు మించి ప్రయాణికులను ఎక్కించుకుంటు న్నారు. మంగళవారం అనుగొండ వద్ద కూలీలను తరలిస్తున్న ఆటోలో చిన్నపిల్లలను టాప్‌పైన కూర్చోబెట్టారు. డ్రైవర్ పక్క, వెనుక సీట్లలో మహిళలు కిక్కిరిసి కూర్చున్నారు. ఇలాంటి ప్రయాణం సురక్షితమా? కాదా ? అని కూలీలు, ఆటో డ్రైవర్లు ఆలోచించడం లేదు. దూరాన్ని బట్టి ఒక్కో కూలీ నుంచి రూ.40, రూ. 50 డ్రైవర్లు వసూలు చేస్తున్నారు. ● **కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి**

# క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


ఎస్‌జీఎఫ్ జ్యోతికి స్వాగతం పలుకుతున్న నాయకులు

- ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్
- రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):** క్రీడాకారులకు ఏ ప్రభుత్వంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరులోని జూనియర్ కళాశాల మైదానంలో అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కర్నూలు సెక్రటరీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారం భమయ్యాయి. మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, మహేష్, మహేంద్ర, డా మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, కౌన్సిలర్ రామదాసు గౌడ్, మాజీ కౌన్సిలర్లు రామకృష్ణ నాయుడు, ముల్లా కలీముల్లా జ్యోతివెలిగించి పోటీలను ప్రారంభించారు. జాతీయజెండాను, స్కూల్‌గేమ్స్ పథాకాన్ని నాయకులు ఎగురవేశారు. కార్యక్రమానికి హాజరైన నాయకులకు, అధికారులకు వివిధజిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు గౌరవవందనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. డీఎస్సీ లేకుండా నేరుగా టీచర్ పోస్టులు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుంద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీలో పాల్గొనకుండానే నేరుగా 50మందికి టీచర్ పోస్టులు ఇచ్చిందన్నారు. ఎమ్మిగనూరు ఫుట్‌బాల్‌కు పెట్టింది పేరు అన్నారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లు ఎమ్మిగనూరు అని ఎంతో మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. క్రీడాభివృద్ధి కోసం దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో పీడీలు రామాంజనేయులు, అస్లాం, హనీఫ్, విక్రమ్, శీను, శ్రీరామ్, నరసింహరాజు, రాఘవేంద్ర, టీడీపీ నాయకులు ఉసేన్ పీరా, బందే నవాజ్ కామర్తి మహేష్, రాజేష్, అబ్దుల్లా, దోమా భీమేష్, ఉరుకుందు, జయన్న తదితరులు పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ జిల్లాల క్రీడాకారులు

## ఉపాధ్యాయుల జీతాలు విడుదల చేయాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):** పొజిషన్ ఐడీలు రాక ఉపాధ్యాయులకు జీతాలు అందడం లేదని విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. మంగళవారం కడపలో ఆర్జేడీ శ్యామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు 2025 మేలో బదిలీలు, పదోన్నతులు ఇచ్చారని నంద్యాల జిల్లాలో నలుగురు ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. హెచ్.తిమ్మన్న, నాగేంద్రప్ప ఉన్నారు.


ఆర్జేడీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

## నవరాత్రి శోభ

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** నగర వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఉదయం వేకువ జాము నుంచి వివిధ ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవార్లకు అర్చకులు పూజాది కార్యక్రమాలు చేపట్టారు. విశేష హోమాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. చిత్తారివీధిలోని నిమిషాంబాదేవి ఆలయంలో గాయత్రి దేవి అలంకరణ చేశారు. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరణ చేశారు. వన్‌టౌన్‌లోని శ్రీరంగధామం సభ్యులచే విష్ణు సహస్రనామపారాయణం, లలితాదేవి సహస్రనామ పారాయణం చేశారు. నగరంలో సప్తగిరినగర్ (కేసీ కెనాల్) సమీపంలోని శ్రీ మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న చౌడేశ్వరి మాతా గుడిలో రెండో రోజు మంగళవారం రాత్రి అమ్మవారు గాయత్రి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి, ద్వారకామాయి సాయిబాబ దేవస్థానం, నెహ్రూనగర్‌లోని పుట్టపర్తి సత్యసాయిబాబా వారి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సభ్యులు సాయిబాబా, సూర్యనారాయణరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మామిదాలపాడులోని శ్రీగోదా గోకుల క్షేత్రంలో అమ్మవారికి ధాన్యలక్ష్మి అలంకరణ చేశారు. సామూహిక కుంకుమార్చన చేపట్టారు. గోకుల క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


సత్యసాయి పీఠంలో పూజలు


నగరంలో పూజలు చేస్తున్న మహిళలు


చిన్నఅమ్మవారిశాలలో పరాశక్తి అలంకరణ


కల్లూరులో



## నేడు విద్యుత్ అంతరాయం

**కల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని సంతోష్‌నగర్, అశోక్‌నగర్ 11 కేవీ ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ టి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనులు చేస్తుండటంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని వెంకటరమణకాలనీ, కప్పలనగర్, శ్రీకృష్ణా కాలనీల వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పశువులను నిర్లక్ష్యం చేయొద్దు

**సి. బెళగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** పశువుల ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం చేయవద్దని పశువైద్యాధికారి శృతికీర్తన పాడిరైతులకు సూచించారు. మంగళవారం సి.బెళగల్‌లో మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు, జబ్బవాపు, జీవాలకు నాలీనాలుక జబ్బులు వస్తున్నాయన్నారు. గాలికుంటు టీకాలను వేయించాలన్నారు.

# చైల్డ్‌కేర్ సెంటర్లను పర్యవేక్షించాలి

● జాయింట్ కలెక్టర్ బి.నవ్య

**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి):** చైల్డ్‌కేర్ సంస్థల్లో చిన్న పిల్లలను నిత్యం పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్, కమిటీ చైర్మన్ డాక్టర్ బీ.నవ్య ఆదేశించారు. మంగళవారం మిషన్ వాత్సల్య స్కీమ్‌లో భాగంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూట్ డిస్ట్రిక్ లెవెల్ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. జిల్లాలో 11 చైల్డ్ కేర్ సంస్థలు ఉండగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో 4, ఏడు ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నారన్నారు. ఆహారం, వసతులు, పరిరక్షణ, విద్య, దుస్తులు, పారిశుధ్య చర్యలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ పి.విజయ తనిఖీల్లో ఫార్మ్-46ఏ పూరించడంలపై వివరించారు. సభ్యులు డా ఎం.మంజూష, మెడికల్ ఆఫీసర్ ఎస్.మహబూబ్ బాషా, డా.డి.గంగాధర నాయక్, రాయపాటి శ్రీనివాసులు ఉన్నారు.



## ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలి

● నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):** ఈసీ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సరిచేయాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో బీఎల్‌ఓలతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ-2-25 అవగాహన నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 కోసం ఈసీ 2002, 2025 ఓటరు జాబితాలను పరిశీలించి డేటా మ్యాపింగ్ చేయాలని ఆదేశించిందన్నారు. ఈ నెలాఖరుకు కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించాల్సి ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదుచేయించాలని సూచించారు. తహసీల్దార్ రవికుమార్, డీటీ ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, వాజిద్, ఆర్‌ఐలు రాజు, సొహైల్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు వేయించండి

**కోడుమూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** పాడి రైతులు పశువులకు గాలిగుంటు వ్యాధి టీకాలు వేయించాలని లద్దగిరి పశువైద్యుడుప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం చిల్లబండ గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. టీకాలు వేయిస్తే వ్యాధిని నిరోధించి పాల ఉత్పత్తి పెరుగుతందని, మగపశువుల్లో పనిసామర్థ్యం తగ్గకుండా ఉంటుందన్నారు. మందలో ఒకదానికి సోకితే అన్నింటికి సోకేప్రమాదం ఉందన్నారు.


చిల్లబండలో టీకా వేస్తున్న పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్

## ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కృష్ణ సూచించారు. మంగళవారం కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అంగికార్ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0లో ఒక ముఖ్య భాగమని పేద, బలహీన వర్గాలకు గృహంతో పాటు సమగ్ర సంక్షేమమే లక్ష్యమన్నారు. ఇళ్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీసీ సతీష్ కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డా.పెంచలయ్య, ఎంఐఎస్ మధుసూధన్‌రెడ్డి, మెడికవర్ వైద్యులు డా.మురళీమోహన్, డా.మంజునాథ్, డా.మహేశ్వరరెడ్డి, డా.బీవీ.కొండారెడ్డి, డా.శేషునాయుడు పాల్గొన్నారు.

## దంచికొట్టిన వాన

**ఓర్వకల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలోని వాగులు, వంకలు, చెక్ డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. ఓర్వకల్లులో కుందూ వాగు నీటితో కళకళలాడుతోంది. అయితే అధిక వర్షాలతో పత్తి, మొక్కజొన్న, కంది, పంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండి, దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు


ఓర్వకల్లులో పొంగి పొర్లుతున్న కుందూ వాగు

## అందుబాటులో ఉండాలి

**సి. బెళగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** పంచాయతీల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాణెమ్మ ఆదేశించారు. వర్షాలు కురుస్తుండటంతో పరిసరా లను పరిశుభ్రంగా ఉంచాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీ-4లో వ్యవసాయ కూలీల కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. దీనిపై శిక్షణ ఇస్తామని సచివాలయ ఉద్యోగులంతా హాజరుకావాలన్నారు.

## కార్మికులను తొలగించొద్దు

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులను తొలగించవద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. కల్లూరు మండలం షరీన్‌నగర్ జడ్పీ పాఠశాల, లక్ష్మీపురం పాఠశాలలో 25 ఏళ్లగా పనిచేస్తున్న జహీరాబీ పి.రాజమ్మను తొలగించడం అన్యాయమన్నారు. జి.ఏసు, మహిళలు ఉన్నారు.


డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

### మూయండి



నగరంలోని అశోక్‌నగర్‌లోని వంశీకృష్ణ హాస్పిటల్ వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనదారులు, పాదాచారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు మ్యాన్‌హోల్‌ను మూసివేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. **- కర్నూలు హాస్పిటల్**

### పూడ్చండి



మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి మర్రిచెట్టు కూడలి రహదారిపై గుంతలు ఉన్నాయి. చిన్న వర్షం కురిసినా నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలను పూడ్చాలని అనంతరం సీసీ రోడ్డు నిర్మించి శాశ్వతంగా పరిష్కారాలని స్థానికులు కోరుతున్నారు. **- ఓర్వకల్లు**

### సరి చేయండి



నగరంలోని 34వ వార్డు నిర్మల్‌నగర్ పార్క్ సమీపంలో డ్రైనేజీ కాలువలో తాగునీటి పైప్‌లైన్ ఉంది. తాగునీరు కలుషితం అవుతుండటంతో ఇప్పటికే పిల్లలు, వృద్ధులు అనారోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్‌ను కాలువపైకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. **- కల్లూరు**





## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

**గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి):** సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేటు పాఠశాలల గుర్తింపును గుర్తింపు రద్దు చేస్తామని ఎంఈవో సునీలమ్మ హెచ్చరించారు. మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 22నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రభుత్వం దరసా సెలవులను ప్రకటించిందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయన్నారు.

## నిరుద్యోగ భృతి ఇవ్వాలి

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2.3లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అధికారంలోకి వస్తే పోస్టులన్నీ భర్తీ చేసి, సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. బీసన్న, శ్రీకాంత్, రసూల్, రామ్‌నాయక్ ఉన్నారు

## సంజీవయ్య పేరు పెట్టాలి

**కోడుమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లాకు మాజీ సీఎం దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని నక్కటమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సంత మార్కెట్లో సంతకాలను సేకరించారు. గాజులదిన్నె ప్రాజెక్టును నిర్మించి రైతులకు సాగునీరు అందించారన్నారు. దామోదరం రాధాకృష్ణ, మునిస్వామి, రాజు, నాగేష్, లాయర్ ప్రభాకర్, బలరాం, భీముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థినులతో వీసీ ముఖాముఖి

**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ ముఖాముఖి నిర్వహించారు. మంగళావారం అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యవిద్యలో నర్సింగ్ కోర్సుకు భవిష్యత్ ఉందన్నారు. కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి, సిబ్బంది ఉపకులపతిని సన్మానించారు.


వీసీని సన్మానిస్తున్న విద్యార్థినులు, యాజమాన్యం

## రైతు సంక్షేమమే లక్ష్యం

**సి. బెళగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** రైతు సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఆ పార్టీ కన్వనర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని సంగాల గ్రామ సమీపాన కంబందహాల్ ఎత్తిపోతల పథకం నుంచి మాజీ ఎంపీటీసీ యాకోబుతో కలిసి నీటిని విడుదల చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచామన్నారు. రైతులు సత్యారెడ్డి, వెంకటేశ్వర్లు, ఉన్నారు.


మోటార్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

## 'ఉల్లి'ని నమోదు చేసుకోవాలి

**కల్లూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):** ఉల్లి సాగుచేసిన రైతులు పంటనమోదు చేసుకోవాలని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం పర్ల గ్రామంలో 'పొలంపిలుస్తోంది' నిర్వహించారు. పూర్తిగా కోతకు వచ్చే వరకు రైతులు కోయరాదన్నారు. పత్తిలో కాయతెగులు నివారణ చర్యలను వివరించారు.


పర్ల గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి

## ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

దేవనకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీవోఎస్ఎస్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ చేరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి తిమ్మారెడ్డి తెలిపారు. ఈ నెల 20న గడువు ముగియడంతో లేట్ ఫీజు రూ.200 చెల్లించి అక్టోబరు 31లోపు ఎప్పుడైన చేరవచ్చాన్నారు. మండలంలోని 14 ఏళ్లు పైబడిన వారు మధ్యలో చదువు ఆపేసి బడిబయట ఉన్నవారు ఓపెన్ టెన్త్, ఇంటర్ చదివేందుకు అర్హులన్నారు. గతంలో చదివే పాఠశాల టీసీ తీసుకొని, జెడ్పీ పాఠశాలలో హెచ్ఎంని సంప్రదించాలన్నారు.

## హొళగుందలో భారీ వర్షం

హొళగుంద, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హొళగుందలో సోమవారం అర్ధరాత్రి రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట నుండి మంగళవారం తెల్లవారు జాము వరకు కురిసిన వర్షానికి పొలాల్లో వర్షపు నీరు పొంగిపొర్లంది. హొళగుంద గ్రామ శివారులోని పత్తి పంటలో నీరు నిలబడడంతోపాటు, ఎడ తెరపి లేకుండ కురుస్తున్న వర్షాలకు రైతుల్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

### ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి


మాట్లాడుతున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి తన శక్తివంచన కృషి చేస్తానని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. మంగళవారం ఆలూరులో ఆమెను కార్యకర్తలు భారీ ఎత్తున కలిసి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీలో వర్గాలకు తావు లేకుండా అందరినీ కలుపుకుపోయి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వైసీపీకోవర్టులకు పార్టీలో నో ఎంట్రీ అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో నగరడోణ, వేదావతి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. తాగునీటి సమస్యపై దృష్టి సారించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు బాగు చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీలో తన సేవలను గుర్తించిన పార్టీ అధినేత చంద్రబాబు, మంత్రి లోకేష్, మంత్రులు, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, రీజనల్ కో ఆర్డినేటర్ బీద రవిచంద్ర, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో దివంగత నేత వైకుంఠం ।రాములు ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, నాయకులు జయరాం, రామచంద్రనాయుడు, కృష్ణయాదవ్, ప్రకాష్, పరమరెడ్డి, శేనప్ప, నరసన్న, జీవన్ కుమార్, శివప్రకాష్, బెంగళూరు కిషోర్, కమ్మరచేడు దేవేంద్ర, సర్పంచ్ ఎల్లప్ప, ఉచ్చీరప్ప, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు వైభవంగా పూజలు


ప్రతిష్ఠించిన దుర్గమ్మ విగ్రహం

మద్దికెర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని బీసీ కాలనీలో విజయవాడ కనక దుర్గమ్మ ప్రతిష్ఠించిన విగ్రహానికి ప్రత్యేక పూజలు వైభవంగా చేశారు. మంగళవారం దుర్గమ్మ మండపంలో దేవినవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి 11 రోజుల పాటు పూజలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు పూజలతో పాటు భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. విజయదశమి ముగిన వెంటనే అమ్మవారిని నిమజ్జనం చేయడం జరుగుతుందని నిర్వాహకులు అముదాల గోపాల్, శేఖర్, ఉరుకుందు, మునిరంగా, రవి ఉన్నారు.


గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు

●మండల పరిధిలోని గ్రామాలలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మి, పార్వతిదేవి అమ్మవార్లు గాయత్రిదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. మంగళవారం దేవి నవరాత్రులలో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణి చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.




# ఆటోనగర్ ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే పార్థసారథి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండో ముంబైగా పేరుగాంచిన ఆదోని పట్టణంలో మూతబడిన పరిశ్రమల ఖాళీ స్థలంలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆదోని నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడారు. పట్టణంలో ఎంతోమందికి ఉపాధి కల్పించిన కొరారిమిల్లు, రాయలసీమ మిల్లులు మూతబడడం వల్ల ఉపాధి కోల్పోయారన్నారు. ఆనాడు పరిశ్రమ యజమానులు ప్రభుత్వం నుంచి ఎంతో రాయితీలు, లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఖాళీ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని సంపాదించుకుంటున్నారన్నారు. ఇది సరైనది కాదని, చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం స్థలాన్ని వాడారో ఆ స్థలంలో కొత్త పరిశ్రమలను స్థాపించాలి లేక ఇతర ప్రభుత్వ అవసరాలకైనా ఆ స్థలాన్ని కేటాయించాలన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీ పొందారు కాబట్టి ఖాళీ ఉన్న 80 ఎకరాలను ఆటో నగర్‌కు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామన్నారు. అపుడే ఆదోని నియోజకవర్గంలో కొంతమందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

● ఎంఈవో భూపాల్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవు దినాలలో ప్రవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నారని ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి తీవ్రంగా పరిగణిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. రెండవ తేదీ వరకు పాఠశాలలు తెరవద్దని సూచించారు.




## ఉచిత ఇసుక అందించడంలో విఫలం

ఆదోని టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉచిత ఇసుకను అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా ఇసుక వ్యాపారం పై చిందులు వేసిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం నోరు మెదపక పోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. . సమావేశంలో పార్టీ మాజీ దిలీప్ దోకా, మారుతీరావు, శ్రీనిత్ రాయల్, దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

## సీడీపీవోపై నేడు విచారణ

ఆలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీడీపీఓ నరసమ్మపై కురువల్లి అంగన్‌వాడీ వర్కర్ భువనేశ్వరి చేసిన అవినీతి, ఆరోపనలు పత్రికల్లో వచ్చిన కథనాలపై బుధవారం ఆలరు ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సీడీపీఓ నరసమ్మకు, వర్కర్ భువనేశ్వరికి జిల్లా ఐసీడీఎస్ పీడీ విజయ నోటీసులు జారీ చేశారు. ఆలూరు మండలానికి చెందిన అందరూ అంగన్‌వాడీ కార్యకర్తలు అన్ని రిజిస్టర్లతో హాజరు కావాలని ఆదేశించారు.

## నిక్కచ్చిగా స్వామిత్వ సర్వే

దేవనకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నిక్కచ్చిగా స్వామిత్వ సర్వే చేయనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో గోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కరిడికొండ గ్రామంలో స్వామిత్ర సర్వే చేశారు. గ్రామంలోని గ్రామ కంఠంలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, నివాస సముదాయాలకు అన్నిటిని సర్వే చేసి ఆన్‌లైన్ నందు నమోదు చేయడం జరుతుందన్నారు. కొలతల అనంతరం నివాస గృహాలకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పంచాయతి కార్యదర్శులు సునీల్‌కుమార్, నాగార్జున, మంజుల, ముని, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయదశమి రోజున దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి జరిగే బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి కోరారు. మంగళవారం చిప్పగిరిలో దేవరగట్టు ఉత్సవాల గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

## ఉల్లి పంట పరిశీలన

ఆదోని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఉల్లి పంటను ఎన్యుమరేషన్ చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని మదిరె గ్రామంలో ఉల్లి పంట రైతులు సాగుచేసిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఎన్యూమరేషన్‌ను జాగ్రత్తగా చేయాలన్నారు. గ్రామంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. దరఖాస్తుదారుల వివరాలను సవివరంగా పరిశీలించి అర్హులైన ప్రతిఒక్కరికీ న్యాయం చేయాలన్నారు. తహసీల్దార్ రమేష్, ఆర్: లక్ష్మయ్య, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదిక్‌తో దీర్ఘకాలిక వ్యాధులు నయం

తుగ్గలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదిక్ వైద్యంలో దీర్ఘకాలికి వ్యాధులు కూడ నయం చేయవచ్చని ఆయుర్వేదిక్ వైద్యులు డా.అమర్‌నాథ్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్ర తుగ్గలిలో ధన్వంతరి పూజలునిర్వహించి వైద్య సిబ్బంది వైద్యశాల నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆయుర్వేదిక్ చికిత్సలు చేయించుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రోజారమణి, వైద్యసిబ్బంది ఉన్నారు.

## 'రైతులకు అండగా ఉంటా'


ఆదోని టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, మర్కెట్ యార్డ్ పరిధిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడంలో కృషి చేస్తానని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఆదూరి విజయకృష్ణ అన్నారు. అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌కు వైస్ చైర్మన్‌గా ఎంపిక అయినందుకు మంగళవారం బీజేపీ కార్యాలయంలో చిన్నహరివాణం, గణేకల్ గ్రామాలకు చెందిన రైతులు ఆయనను సన్మానించారు. చిన్న కొండయ్య, నరసింహులు, లక్ష్మీరెడ్డి, పంపాపతి, వెంకటేష్, చంద్ర, మల్లప్ప, పులిగప్ప, నాగరాజు పాల్గొన్నారు.

## ఆందోళన విరమింపజేసిన పోలీసులు

హొళగుంద, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం విద్యుత్ ఘాతంతో మృతి చెందిన మారెన్న మృతదేహంతో ఈడిగ ఈరన్న ఇంటి ముందు ధర్నా చేపట్టిన కుటుంబ సభ్యులు, మాల మహానాడు నాయకుల తో ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, హొళగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ గురజాల గ్రామ పెద్దలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున వచ్చే ఆర్థికసాయం అందేలా చూస్తామని, హామీ ఇవ్వడంతో మాలమహానాడు నాయకులు పలు డిమాండ్లను పోలీసులు, గ్రామ పెద్దలకు విన్నవించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈరన్న మృతదేహాన్ని కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి స్మశానంలో కననం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పత్తి దిగుబడులతో మార్కెట్ కళకళ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ పత్తి రైతుల చేతికి అందింది. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మంగళవారం విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులతో మార్కెట్ యార్డ్ కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే రైతులు తమ గ్రామాల నుంచి మార్కెట్ కమిటీకి విక్రయానికి భారీగా పత్తి దిగుబడులను తీసుకొచ్చారు. ఎటువైపు చూసిన తెల్ల బంగారంతో ప్లాట్‌ఫార్మ్‌లన్నీ నిండిపోయాయి. దసరా పండుగ రావడంతో పండుగ ఖర్చులకోసం పత్తిని విక్రయానికి భారీగా తీసుకొస్తున్నారు. పత్తి ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు విక్రయానికి ఆసక్తి చూపుతున్నారు. 9310 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా క్వింటాళు వాటి ధర రూ. 39600, మధ్యధర రూ. 7300, గరిష్ట ధర రూ. 7641లు పలికింది.







## 'రెఫర్' పై ఆర్డీవో విచారణ


ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ నిర్వహిస్తున్న ఆర్డీవో

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన సంఘటనపై కథనాలు వెలువడ్డాయి. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ సందర్శించి విచారణ చేపట్టారు. 'కాలిన గాయాలతో వస్తే చికిత్స అందించకుండా రెఫర్ అంటారా.. అనే వార్తా కథనం మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమయ్యింది. ఇందుకు స్పందించిన ఆర్డీవో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో విచారణ చేపట్టారు. అనంతరం అక్కడ రోగులను వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు, సిబ్బంది తదితర అంశాలపైన సూపరింటెండెంట్ హరికను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందరికీ అందేలా చూడాలని సూచించారు. ఆర్డీఓ వెంట ఆర్ఐ శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది ఉన్నారు.

## తప్పుల తడకగా రీసర్వే

మద్దికెర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో రీసర్వే తప్పుల తడకగా చేశారంటూ రైతులు రీసర్వే అధికారులతో వాగ్వివాదానికి దిగారు. మంగళవారం స్థానిక ఆర్‌బికే కేంద్రంలో సర్వేయర్లతో ఉపసర్పంచి కవిరెడ్డి క్రిష్ణ, సుధాకర్ చౌదరి, నాగరాజు, రామాంజి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మా భూములు సక్రమంగా ఉన్నప్పటికి, మీ నిర్లక్ష్యం వల్ల భూములు కొలతలు అన్యాయం చేశారని ఆరోపించారు. సర్వే అధికారులు మాత్రం మేమే ఏమి చేయలేమని చెప్పడం కొసమెరుపు.

## ఎరువులు వచ్చేశాయ్


యూరియా రికార్డును పరిశీలిస్తున్న ఏవో సుధాకర్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆదోని డివిజన్‌కు అవసరమైన ఎరువులు వచ్చేశాయి. మంగళవారం ర్యాక్‌పాయింట్‌కు 1332.18 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుంది. మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ప్రైవేటు డీలర్స్ కు 598 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించామన్నారు. కోసిగి మండలానికి 76.5 మెట్రిక్ టన్నులు, ఎమ్మిగనూరుకు 89.1 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ కింద 732 మెట్రిక్ టన్నులు కేటాయించామన్నారు. పాత స్టాక్ తో కలిపి 2000 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వ ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు ఎరువులు కోసం ఇబ్బందులు పడొద్దు అని రైతు భరోసా కేంద్రాలలో ప్రైవేట్ డీలర్ల దగ్గర సమృద్ధిగా ఎరువులు ఉన్నాయన్నారు. ఎమ్మార్పీ కంటే ఒక పైసా కూడా అధికంగా ఇవ్వద్దని సూచించారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి

మద్దికెర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు ప్రతి బుధవారం వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎక్కువగా ఆకుకూరలు వాడటం వల్ల రక్తం వృద్ధి చెందుతుందన్నారు. ప్రసవానికి ప్రభుత్వ వైద్యశాలకు రావాలన్నారు. వైద్యసిబ్బంది అక్బర్‌బాషా పాల్గొన్నారు.

## ఈకేవైసీ చేయించుకోవాలి

కోసిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఈకేవైసీ, ఫేషియల్ యాప్ 30లోగా ఫీల్డ్ అసిస్టెంట్లు చేయించాలని ఏపీడీ లోకేశ్వర, ఏపీవో ఖాలిక్ అన్నారు. మంగళవారం కోసిగిలోని ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్‌లతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ లోకేశ్వర మాట్లాడుతూ మండలంలో 13,336 జాబ్ కార్డులలో 20,716 మంది ఉపాధి కూలీలకు ఈకేవైసీ, ఫేషియల్ యాప్‌ను చేయించాలన్నారు. అక్టోబరు 1 నుంచి ఆధార్ ఈకేవైసీ, ముఖహాజరు వేయడం జరుగుతుందన్నారు.

## సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

కోసిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ ఉద్యోగులకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఏవో హరిలీల ఆధ్వర్యంలో పీ4కు సంబంధించి బంగారు కుటుంబానికి కావల్సిన అంశాలు ఇప్పటి వరకు ఉన్న కుటుంబాల స్థితిగతులను గుర్తించి బంగారు కుటుంబానికి కావాల్సి విధానాలపై శిక్షణ నిర్వహించారు.

నందవరం: నందవరంలో పీ-4పై బుధవారం అధికారులకు ప్రత్యేక సమావేశం జరుగుతున్నట్లు అదనపు ఎంపీడీవో సందీప్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్ కింద పీ 4పై మండల అధికారులకు శిక్షణ ఉంటుందన్నారు. అలాగే ఎస్‌వోపీలకు మధ్యాహ్నం తర్వాత శిక్షణ జరుగుందన్నారు. అధికారులు ఆధార్ కార్డు, ఆధారు కార్డుకు లింక్ అయిన ఫోన్, ఐడీ నెంబరును తీసుకు రావాలని సూచించారు.

## మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మందులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు గురు రాజారావు

నందవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ద వహించాలని బీజేపీ నాయకులు గురురాజారావు తెలిపారు. మంగళవారం మిట్టసోమాపురం గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. రోగులను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో నాయకులు నారాయణ, మాజీ సర్పంచ్ రామన్నగౌడు,శివ,శ్రీనివాసులు, దస్తగిరి, హనుమన్న, నాగరాజు, దండు వీరేష్ పాల్గొన్నారు.

## 'బాధిత కుటుంబానికి అండగా ఉంటా'

కౌతాళం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త ఎర్రిస్వామి తల్లి రాగమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న చెన్నబసప్ప మంగళవారం కార్యకర్త ఎర్రిస్వామి ఇంటి వెళ్ళి మృతి చెందిన రాగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.5 వేల నగదును అందజేశారు. టీడీపీ కార్యకర్తలు భీమయ్య, నరసయ్య, నాగప్ప, ఈరన్న ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించండి



ఏవో హరిలీలకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

కోసిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబరు 1న పింఛన్ల పంపిణీని నిలిపి వేస్తామని సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి ఏఓ హరిలీలకు వినతి పత్రం మంగళవారం అందించారు. కోసిగిలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు.

## ముందస్తు చర్యలు తీసుకోండి



కార్మికులను సన్మానిస్తున్న డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి

గోనెగండ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ అధికారులు ముందస్త చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో(డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి) బాలకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం గోనెగండ్లలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను శాలువ పూలమాటలలతో ఘనంగా డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో మణిమంజరి, డిప్యూటీ ఎంపీడీవో అనంత శయన, సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్ పాల్గొన్నారు.

# దిగులుబడి!





అధిక వర్షాలతో నాశనమైన పత్తి పంట

- అకాల వర్షంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం
- రాలిపోతున్న పూత, కాయలు,
- ఆందోళనలో రైతన్నలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



పూర్తిగా పగలని (గొగ్గి) పత్తి కాయ

మంత్రాలయం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాలు రైతుల్లో ఆనందం నింపాయి.. ఎన్నో ఆశలతో రైతులు పంటలు సాగు చేశారు. అడపాదడపా కురిసిన వర్షాలకు పంటలు కళకళలాడాయి. ఇక ఈ ఏడాది పంటలు బాగా పండి చేసిన అప్పులన్నీ తీరుతాయని రైతన్న ఆశపడ్డాయి. వారి ఆశలపై వరుణుడు ఒక్కసారిగా నీళ్లు చల్లాడు. ఎక్కడ రైతన్న బాగుపడుతాడోనని కక్ష కట్టి నెలన్నర నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంటలన్నీ నాశనమమై.. కొమ్ములు మాత్రమే మిగిల్చి విషాదం నింపిందని రైతన్నలు లబోదిబోమంటున్నారు. మంత్రాలయంలో నియోజకవర్గంలో అత్యధికంగా ఈ ఏడాది పత్తి పంట సాగు చేశారు. పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం, కోసిగి మండలాల్లో అధిక వర్షాలతో తేమ శాతం ఎక్కువ కావడం, పత్తి పంటలో నీళ్లు ఆగడంతో ఉన్న పూత, కాయ, పిందె రాలిపోయాయి. దీనికి తోడు ఎర్రకుల్లు, తెగుళ్ల దోమలు సోకి ఎంత మందును పిచికారి చేసినా అదుపు కావడం లేక రైతన్నలు అప్పుల పాలవుతున్నారు.



20 రోజుల నుంచి వర్షం నీటిలోనే పత్తి పంట



తెగులు సోకడంతో చెట్టుపైనే మాడిపోతున్న పత్తికాయలు

నియోజకవర్గంలో మొత్తం 86,500 ఎకరాల్లో పంట సాగు చేయగా. 23,250 ఎకరాలు నష్టం వాటిల్లినట్లు అంచనా చేస్తున్నారు.గత ఏడాది మిరప పంటను నమ్ముకుని అప్పులు మూట గట్టుకుంటే ఈ ఏడాది మంత్రాలయం నియోజకవర్గంలో అధిక శాతం పత్తి పంటను సాగు చేశాం. చేతికందుతున్న తరుణంలో వర్షానికి పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు దాదాపు 20నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టాం. దీనికి తోడు ఎర్రకుల్లు, పచ్చదోమ, తెగుళ్ల, సోకి అపార నష్టాన్ని కలిగించాయి. ఉదయం మందులు పిచికారి చేయడం, సాయంత్రానికి వర్షం రావడంతో ఉన్న పంట కూడా తెగుళ్లతో పరిమితమైంది. గాలిలో తేమ శాతం వల్ల కాండం, ఆకుల మచ్చలు, కాయ పత్తి పూర్తిగా పగలకుండానే గొగ్గిగా మారడంతో తీసేందుకు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ఏడాది పత్తిని నమ్ముకున్న రైతులందరూ కుదేలై అప్పులు మూట కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు దిగాలు చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### తెగుళ్లు సోకి పంటంతా పోయింది



తొమ్మిది ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఇందులో ఐదెకరాలు వైరస్ సోకి నష్టం వాటిల్లింది. మరో నాలుగెకరాల్లో అప్పులు చేసి మందులు పిచికారి చేస్తూ కాపాడుకుంటున్నా.

● బోయ భీమరాయుడు, రైతు, మాధవరం

### ప్రభుత్వం ఆదుకోవాలి



గత ఏడాది ఐదెకరాల్లో పత్తి పంట వేసి నష్టపోయా. ఈ ఏడాదైనా పంట బాగా వస్తుందని ఆశించినా ఫలితం లేదు. ఇప్పటికీ పత్తి పంటలో నీళ్ల ఆగిఉన్నాయి. అధికారులు, ప్రభుత్వమే ఆదుకోవాలి.

● సొరకాయ ఈరన్న, రైతు, మాధవరం

### పత్తి ముంచింది..



పత్తి పంట నమ్ముకుని అప్పుల పాలయ్యా. పంట ఏపుగా పెరిగినా ఈ ఏడాది పంట దిగుబడి బాగా వస్తుందని ఆశించా. అధిక వర్షాలతో పూర్తిగా నష్టపోయాం. అప్పులు పెరిగాయి గానీ, తీర్చేదారి కనపడడం లేదు.

● విశ్వనాథ్‌గౌడు, దొడ్డిమేకల గ్రామం, పెద్దకడుబూరు మండలం

### వర్షం తగ్గితే పంటను కాపాడుకోవచ్చు

అధిక వర్షాలతో గాలిలో తేమ అధికంగా ఉండటం, పత్తి పొలాల్లో నీరు ఆగడంతో పత్తి పంటలకు నష్టం జరిగింది. వేరుకుళ్ల, మచ్చల తెగుళ్ల, ఆకుమచ్చ తెగుళ్ల వేరుకుళ్ల, ఎర్రకుల్లు సోకినప్పటికీ వర్షం తగ్గి గాలిలో వాతావరణం తేమ తగ్గితే పత్తి పంటను తిరిగి యథాస్థానానికి చేసుకోవచ్చు. పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంట దిగుబడి తగ్గుతుంది.

● మహ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

## నానో యూరియాతో అధిక దిగుబడి

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను పంటలకు వాడితే అధిక దిగుబడి వస్తుందని ఏడీఏ మహ్మద్ ఖాద్రీ అన్నారు. మంగళవారం గుడికల్ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఏవో శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ పరిధిలో సాగుచేసిన వరితో పాటు వివిధ పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. యూరియా వాడకం తగ్గించి రైతులు నానో యూరియా వాడితే అధిక దిగుబడి వస్తుందని సూచించారు. పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యం ఆచారి మాట్లాడుతూ పశువులు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు వ్యాక్సినేషన్ వేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏఈఓలు వినోద్ కుమార్, నరసింహులు, వీఏవో హిమబిందులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏడీఏ మహ్మద్ ఖాద్రీ

### పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

పెద్దకడబూరు: పంటపొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఏవో సుచరిత సూచించారు. మంగళవారం పీకలబెట్ట గ్రామ సమీపంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటల పరిరక్షణలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రతి రైతు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఈ క్రాప్ నమోదును చేసుకోవాలని తెలిపారు.



పీకలబెట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుచరిత

మంత్రాలయం: నానో ఉత్పత్తులతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి జ్జీర గణేష్, ఏఈఓ తిరుమల రెడ్డిలు అన్నారు. చట్నీహళ్ళి గ్రామంలో మంగళవారం రైతులకు యూరియాతో పాటు నానో యూరియా, నానో టిఏపీ ఉత్పత్తులను తహసీల్దార్ రమాదేవితో కలిసి వ్యవసాయాధికారులు రైతులకు అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు యూరియాను పంటలకు అందించాలని యూరియాను మోతాదుకు మించి వాడితే ప్రమాదకరమన్నారు. నానో యూరియాను వాడితే పంటకు కావాల్సిన మోతాదు మాత్రమే తీసుకుని పంట దిగుబడి అధికంగా ఉండేలా చేస్తుందన్నారు. రైతులు నానో ఉత్పత్తులను వాడాలని కోరారు. అనంతరం రైతులకు యూరియాను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజనేయులు, ఎంపీటీసీ రామాంజనేయులు, సొసైటీ డైరెక్టర్ చాపల నగేష్, రైతు భరోసా విజయ్ ఉన్నారు.

## శ్రీమఠానికి టేకు సరఫరా



లారీలో రూ.30లక్షల టేకు చెక్కతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి,పన్నగ వెంకటేశ్వర్లు,టీడీపీ నాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాలు మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి రూ. 30 లక్షలు విలువ చేసే టేకు చెక్కను ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, శ్రీపతిఆచార్ తెలిపారు. మంగళవారం టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి,టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, విజయరామిరెడ్డి రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని లారీలో తెచ్చిన టేకు కలపను శ్రీమఠం ఇంజనీరింగ్ అధికారులకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. శ్రీనివాసరెడ్డి, వారి కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ యల్లారెడ్డి,సున్నం రాఘవేంద్ర, నరసింహా,చిన్న భీమ, గురురాజు, హండే హనుమంతు, తిక్కాస్వామి గౌడు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెద్దకడబూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్త్రీశక్తి టీం కానిస్టేబుల్ నాగన్న తెలిపారు. మంగళవారం పెద్దకడబూరు మండల పరిధిలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాలలో మత్తుపదార్థాలపై విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వలన జీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుశీలమ్మ, అధ్యాపకులు క్రాంతికుమార్, సూపరింటెండెంట్ మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే సహించేదిలేదు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే సహించేదిలేదని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందన్నారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం మాత్రం దసరా సెలవుల్లో కూడా విద్యార్థులను పాఠశాలకు రావాలని ఆదేశించిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం



మండల వ్యవసాయాధికారి వరప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యానవన శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఉల్లి రైతులకు శాపంగా మారిందని రైతు సంఘం మండల నాయకులు వీరేష్, పూజారి శ్రీనివాసులు సీపీఎం నాయకులు రాముడు ఆరోపించారు. మంగళవారం మండలంలోని ఉల్లి రైతులతో కలిసి మండల వ్యవసాయశాఖ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల ఏఓ వరప్రసాద్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం హెక్టారు ఉల్లి పంటకు రూ.50వేలు అందిస్తుందని, ఐతే స్థానిక అధికారులు మాత్రం ఈ-క్రాప్ బుకింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. మండలంలో సుమారు 500 మంది 2వేల ఎకరాలకు పైగా ఉల్లి పంటను సాగు చేశారని, అయితే అధికారుల లెక్కల ప్రకారం 16వందల ఎకరాలకు ఉల్లి పంట ఈ-క్రాప్ చేయడంతో మిగతా ఉల్లి రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధి కారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉల్లి రైతులు శివయ్య, ప్రకాష్, చిన్న కోసిగయ్యలక్ష్మన్న, మహదేవి, నరసప్ప, క్రిష్ణమ్మ, శరబందు పాల్గొన్నారు.

## తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు



వెయింగ్ మిషన్లకు సీలు వేస్తున్న తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని తూనీకల కొలతల ఇన్‌చార్జీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డు క్యాంటిన్‌లో రేషన్ డీలర్లు వినియోగించే వెయింగ్ మిషన్లకు తూకాల్లో మోసాలకు పాల్పడకుండా సీలు వేశారు. పత్తి కొనుగోలు చేస్తున్న దుకాణాల్లో కాటాను పరిశీలించారు. రైతులు తెచ్చే పంట ఉత్పత్తులను సక్రమంగా తూకాలు వేసి కొనుగోలు చేయాలని సూచించారు.

## మార్కెట్ కమిటీలో కొత్తగా 40 దుకాణాల నిర్మాణం

- రూ. 2.15కోట్లతో ప్రతిపాదనలు
- రైతు బజారు ఏర్పాటుకు చర్యలు



ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో(కోసిగి రోడ్డువైపు) 40 కొత్తదుకాణాలు నిర్మాణం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్‌లో ఉన్న దుకాణాలు కొన్ని శిథిలావస్థకు చేరాయి. వర్షానికి కారుతుండటంతో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఐదురోజుల క్రితం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మార్కెట్‌లో పర్యటించిన సందర్భంగా ఈ దుకాణాలను పరిశీలించారు. వీటి స్థానంలో కొత్తగా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మార్కెట్ అధికారులకు సూచించారు. మార్కెట్ లోపలివైపుకు 20 దుకాణాలు, బయట కోసిగి రోడ్డు వైపు మరో 20 దుకాణాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు మార్కెటింగ్ శాఖకు పంపాలని సూచించారు. దీంతో మార్కెట్ అధికారులు రూ. 2.15కోట్లతో 40 దుకాణాలు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

**రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు:** వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోనే రైతు బజార్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మార్కెట్‌లో పర్యటించిన సందర్భంగా కమీషన్ ఏజంట్ల దుకాణాల వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఆ ఖాళీ స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని అధికారులతో చర్చించారు. రైతు బజార్ ఏర్పాటు చేసే స్థలం పక్కనే ఉన్న మరి కొంత ఖాళీ స్థలంలో హోల్ సేల్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.





ఎమ్మిగనూరులో గాయత్రీదేవిగా వాసవిమాత అమ్మవారు



నందవరంలో పూజలు చేస్తున్న భక్తులు

## వివిధ రూపాల్లో అమ్మవార్లు

దేవి నవరాత్రుల సందర్భంగా రెండో రోజు మంగళవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఎమ్మిగనూరు, కౌతాళం, మంత్రాలయం, గోనెగండ్ల, నందవరం మండలాల్లో అమ్మవార్లకు భక్తులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



కౌతాళం మండలం ఉప్పరహాల్‌లో గాయత్రీదేవిగా మారికాంబదేవి



ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామంలో పూజలందుకుంటున్న అమ్మవారు



గోనెగండ్ల మండల కులుమాల గ్రామంలో గాయిత్రిదేవి అలంకరణలో అమ్మవారు